సంపుటి :02 సంచిక :175 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

బుధవారం 03, సెప్టెంబర్ 2025

## వినాయక నిమజ్జనం రోజున
# ట్రై సిటీలో ట్రాఫిక్ ఆంక్షలు



- 5న మధ్యాహ్నం 12 నుంచి 7న 13 గంటల వరకు
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



## స్కూల్ విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం..!

- స్టీరింగ్ ఫెయిలై అదుపు తప్పిన మాంటిస్సోరి స్కూల్ బస్సు
- కాటారం మండలంలో ఘటన

05



- 'మేఘా'తో కలిసి రూ.750 కోట్ల విల్లా ప్రాజెక్ట్ కడుతున్నాడని వెల్లడి
- ఈ విషయాన్ని స్వయంగా ఎమ్మెల్యే పల్లానే తనకు తెలిపాడని స్పష్టీకరణ

03

# పల్లా x పోచంపల్లి

ఎమ్మెల్సీ పోచంపల్లిపై జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు

- గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో జనగామ సీటుపై ఇద్దరి గురి
- పల్లాకు సీటు దక్కడంతో పోచంపల్లి అసంతృప్తి
- కవిత వ్యాఖ్యలతో మరోసారి బయటపడిన విభేదాలు

బీఆర్ఎస్ పార్టీలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి మధ్య వర్గపోరు నడుస్తున్నట్లు కల్వకుంట్ల కవిత చేసిన సంచలన వ్యాఖ్యలతో మరోసారి బహిర్గతమైంది. సంతోష్ కుమార్ అండదండలతో సామాన్య కుటుంబం నుంచి వచ్చిన పోచంపల్లి కోట్ల ఆస్తులు కూడబెట్టారని కవిత ఆరోపించారు. పోచంపల్లి 'మేఘా' సంస్థతో కలిసి రూ.750 కోట్ల విల్లా ప్రాజెక్టు కడుతున్నారని, ఈ విషయాన్ని స్వయంగా పల్లా రాజేశ్వర్ రెడ్డే తనకు చెప్పారని కవిత వెల్లడించడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వ్యాఖ్యలతో గత అసెంబ్లీ ఎన్నికల నుంచి వీరిద్దరి మధ్య కొనసాగుతున్న ఆధిపత్య పోరు మరోసారి తెరపైకి వచ్చింది.

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

## హరీశ్ ట్రబుల్ షూటర్ కాదు..
# బబుల్ షూటర్

- ఆయనే సమస్య సృష్టిస్తడు.. ఆయనే పరిష్కరిస్తున్నట్టు షో చేస్తడు
- 2009లో కేటీఆర్ ను ఓడించాలని కొందరికి డబ్బులు పంపిండు..
- నేను ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తే నన్ను ఓడించాలనుకున్నడు..
- మాజీ ఎంపీ సంతోశ్ కు ధనదాహం
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా

02



బీఆర్ఎస్‌కు హరీష్ రావు, సంతోష్ అనే ఇద్దరు చీడలు పట్టి పార్టీని నాశనం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావును 'ట్రబుల్ షూటర్' కాదని, 'బబుల్ షూటర్' అంటూ మండిపడ్డారు. పార్టీకి సమస్యలు సృష్టించి, ఆయనే పరిష్కరించినట్లుగా నటిస్తారని ధ్వజమెత్తారు. పార్టీ నుంచి సస్పెండ్ అయిన నేపథ్యంలో బుధవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. తాను బీఆర్ఎస్‌కు, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అదే సమయంలో పార్టీపై, ముఖ్యంగా హరీష్ రావు, సంతోష్‌పై తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించారు. గత పదేళ్ల కాలంలో హరీష్ పార్టీని దెబ్బతీసేందుకు ఏ విధంగా ప్రయత్నించారో ఆమె వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి హరీషే కారణమని, రేవంత్ రెడ్డితో ఆయనకు మ్యాచ్ ఫిక్సింగ్ ఉందని కవిత ఆరోపించారు. కేటీఆర్‌ను ఉద్దేశిస్తూ 'రామన్నా పార్టీని జాగ్రత్తగా కాపాడుకో, లేకపోతే రేపు నీకు కూడా అదే పరిస్థితి వస్తుంది' అని హెచ్చరించారు.

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి



03

## కాకతీయుల నిర్మాణాలు అద్భుతం

- ప్రాకారపు ఆలయాలు శివ ద్వారపాలక విగ్రహాలు ఆకట్టుకున్నాయి
- శిల్ప సంపదను భావితరాలకు అందేలా చూడాలి
- సాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సుల్ ఐఎఫ్ఎస్ బృందం
- జిల్లా కలెక్టర్ తో కలిసి కోటగుళ్ల సందర్శన

## అడ్డు తొలగించుకోవడానికి ప్రియుడితో కలిసి భర్త, కూతురు హత్య



- చిట్యాల మండలంలోని ఒడితెల గ్రామంలో ఘటన
- నిందితులను ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు
- మీడియాకు వివరాలు వెల్లడించిన భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే

05

# వినాయక మండపాల వద్ద మహా అన్నదానం

## పాల్గొన్న టీ.పి.సి.సి సభ్యుడు పెండెం రామానంద్

అక్షర దర్బార్, దుగ్గొండి/నర్సంపేట: నర్సంపేట డివిజన్ పరిధిలోని గ్రామాల్లో వినాయక మండపాల వద్ద దాతల సహకారంతో మహా అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించారు. నర్సంపేట పట్టణంలో జరిగిన మహా అన్నదానంలో టీ.పి.సి.సి సభ్యుడు పెండెం రామానంద్ గణనాథుని దర్శించి పూజలు చేశారు. దుగ్గొండి మండలంలో ద్యాగం రవళి ప్రతాప్ దంపతులు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రవి, పంబి వంశీకృష్ణ, మాజీ కౌన్సిలర్ ములకల వినోద్ సాంబయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు తుమ్మలపల్లి సందీప్, ఇతర పార్టీ నాయకులు, మహిళా–యూత్ నాయకులు పాల్గొన్నారు.



# బావిలో పడి యువకుడు మృతి

## బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నేతల పరామర్శ



అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలం ధూత్‌పల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. అనంతరం మృతదేహాన్ని చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా కాంగ్రెస్ ప్రతినిధి దొడ్డి కిష్టయ్య ఆసుపత్రికి చేరుకుని ప్రశాంత్‌కు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కోమురయ్య, యువ నాయకులు గోల్కొండ నాగరాజ్, శంకర్, బుర్ర మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఫొటోగ్రాఫర్ మధుకు ఘన సన్మానం

అక్షర దర్బార్, భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీ 17వ వార్డులో వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ పాలకుర్తి మధును ఘనంగా సన్మానించారు. ఉమ్మడి వరంగల్ స్థాయిలో ఉత్తమ ఫొటోగ్రఫీ అవార్డు సాధించిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు దాసరి బ్రహ్మరెడ్డి, వంగళ మోహనచారి, కొండపాక రాజేష్, శివ కుమార్, కట్ట నర్సింహచారి, చిలుముల శ్రీనివాస్, పుల్యాల తిరుపతి, అంబటి భూమయ్య, చెన్నావేన ఓదెలు, చర్ల రమేష్, సోమనవేన తిరుపతి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బేతోజు వజ్ర మణి, భరత్ కుమార్ చారి హాజరయ్యారు. మహిళా బృందం కూడా పాల్గొని సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# హరీశ్ ట్రబుల్ షూటర్ కాదు..

# బబుల్ షూటర్

- ఆయనే సమస్య సృష్టిస్తడు.. ఆయనే పరిష్కరిస్తున్నట్టు షో చేస్తడు
- 2009లో కేటీఆర్ ను ఓడించాలని కొందరికి డబ్బులు పంపిండు..
- నేను ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తే నన్ను ఓడించాలనుకున్నడు..
- 2018 ఎన్నికల్లో సొంతంగా 25 మంది ఎమ్మెల్యే అభ్యర్థులకు డబ్బు పంపిండు..
- మా కుటుంబాన్ని విడదీయాలనుకున్నడు..
- మాజీ ఎంపీ సంతోశ్ కు ధనదాహం
- హరిత హారాన్ని పక్కన పెట్టి గ్రీన్ఇండియా చాలెంజ్ అన్నడు..
- ఫారెస్ట్ ల్యాండ్స్ కొట్టేయాలనుకున్నడు..
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా



**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

'హరీశ్ ట్రబుల్ షూటర్ కాదు.. బబుల్ షూటర్. బీఆర్ఎస్ ను ముంచాలనకున్నడు. ఆయనే సమస్య సృష్టిస్తడు. మళ్లీ ఆయనే పరిష్కరిస్తున్నట్టు షో చేస్తడు' అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నుంచి పార్టీ అధినేత కేసీఆర్ సస్పెండ్ చేసిన నేపథ్యంలో బుధవారం ఆమె హైదరాబాద్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ముందుగా తాను బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి, అలాగే ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తాను ఏ పార్టీలో చేరడం లేదని స్పష్టం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్రెడ్డిని హరీశ్ రావు కలిసి ముచ్చటగా ఫోటో దిగిండు. 2009 ఎన్నికల్లో సిరిసిల్ల నియోజకవర్గంలో కేటీఆర్ ను ఓడించేందుకు, రూ.60 లక్షలు ఖర్చుపెట్టిండు. 2018 ఎన్నికల్లో సొంతంగా 20 నుంచి 25 మంది ఎమ్మెల్యే అభ్యర్థులకు భారీగా డబ్బు పంపించిండు. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? మొత్తం కాళేశ్వరం నుంచి కొట్టేసిందే. డబ్బు ఎందుకు పంపిండంటే.. ఆయన వద్ద కూడా ఎమ్మెల్యేలు ఉండాలనుకున్నడు. బీఆర్ఎస్ కు తాను కట్టప్ప అని చెప్పుకుంటడు. అది నిజం కాదు. నిజామాబాద్ ఎంపీ అభ్యర్థిగా నేను నిలబడితే, ఆ పార్లమెంటరీ నియోజకవర్గంలో ఉన్న ఎమ్మెల్యేలందరితోనూ హరీశ్ టచ్ లో ఉన్నడు. నన్ను ఓడించాలని చూసిండు. మొన్నటికిమొన్న ఎమ్మెల్సీగా దాసోజు శ్రవణ్ను చేద్దామని కేసీఆర్ భావిస్తే, హరీశ్ బీజేపీ వాళ్లకు కాల్ చేస్తడు. మీ నుంచి రెండో అభ్యర్థిని పెట్టమన్నడు. ఇదే విషయాన్ని బీజేపీ ఎమ్మెల్యే ఒకాయన నాకు కాల్ చేసి చెప్పిండు. నేను కేసీఆర్ కు కాల్ చేసి విషయం చెప్పిన. కేసీఆర్ బరాబర్ ఎమ్మెల్సీ శ్రవణేనని తేల్చిచెప్పిన్రు. హరీశ్ రావు దెబ్బకు రఘునందన్ రావు, విజయశాంతి, విజయ రామారావు, జగ్గారెడ్డి, చెరుకు శ్రీనివాసరెడ్డి, మైనంపల్లి, ఈటల రాజేందర్ వంటి ఎందరో పార్టీ నుంచి బయటకు వెళ్లారు. హరీష్ రావు కారణంగానే దుబ్బాక ఎమ్మెల్యే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయింది' అని కవిత సంచలన ఆరోపణలు చేశారు.

### హరీష్ రావు, రేవంత్ రెడ్డి మ్యాచ్ ఫిక్సింగ్

**'సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి హరీశ్ రావు వెనుక మ్యాచ్ ఫిక్సింగ్ ఉంది. వారిద్దరూ మంచి ఖాస్ దోస్తులు. వారిద్దరూ కొన్నాళ్ల క్రితం ఒకే విమానంలో ఢిల్లీకి పోయిండ్రు. హరీష్ రావు పాల వ్యాపారంపై ఆ మధ్య ఆరోపణలు వచ్చినయి. అన్ని పత్రికల్లో దానిపై వార్తలు వచ్చినయి. కానీ, రెండు మూడు రోజుల తర్వాత దాని ఊసేలేదు. రంగనాయకసాగర్ వద్ద హరీష్ రావుకు ఫాం హౌస్ ఉందని గతంలో రేవంత్రెడ్డి ఆరోపించిండ్రు. మరి ఆ తర్వాత దానిపై ఎందుకు విచారణ జరగలే? ఒక సీఎంగా కేసీఆర్ కాళేశ్వరంపై కేవలం విధాన పరమైన నిర్ణయం తీసుకున్నరు. నాడు నీటిపారుదల మంత్రిగా మొత్తం చూసుకున్నది హరీశ్ రావే. బరాజ్ ప్రాంతం తుమ్మడిహట్టి నుంచి మేడిగడ్డకు ఎందుకు మార్చిండ్రు. కోట్లకు కోట్లు హరీశ్ రావు వెనుక వేసుకున్నరు. మొన్న అసెంబ్లీలో కూడా సీఎం ఎంతసేపూ కేసీఆర్ నే బద్నాం చేయాలని చూసిన్రు. హరీష్ రావు జోలికి వెళ్లలేదు. కేసీఆర్ పై సీబీఐ విచారణ దాక పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. హరీష్ రావు మొదటి రోజు నుంచి టీఆర్ఎస్ లో ఉన్నారనేది అబద్ధం. ఆయన కోటిన్నర తీసుకుని వ్యాపారం చేసుకోవడానికి వెళ్లిపోయిండు. పార్టీ మీద హరీష్ రావుకు నమ్మకం లేదు. తొమ్మిది, పది నెలల తర్వాత పార్టీలోకి వచ్చిండు.**

### - ఎన్నో ఉద్యమాలు చేసిన

'గురుకులాలు బాగుండాలని, విద్యార్థులు బాగుండాలని పోరాడిన. సర్కార్ ముసలోళ్లకు పింఛన్లు ఇవ్వాలని కొట్లాడిన. మహిళలకు నెలకు 2,500 ఇవ్వాలని పోస్ట్ కార్డు ఉద్యమం చేసిన. బీసీలకు 42శాతం కోటా ఇవ్వాలని పోరాడిన. సీఎం రేవంత్ తెలంగాణ తల్లి స్వరూపాన్ని మారిస్తే గళమెత్తిన. గోదావరిపై ఏపీలో బనకచర్ల ప్రాజెక్ట్ కడతా ఉంటే రౌండ్ టేబుల్ సమావేశం పెట్టిన. పాలమూరు భూనిర్వాసితుల గురించి పోరాడిన' అని కవిత అన్నారు.

### - రామన్న.. పార్టీ జాగ్రత్త

'బీఆర్ఎస్ కు పట్టిన చీడ. తన్నీరు హరీశ్ రావు, సంతోశ్. వాళ్లిద్దరి వల్లే పార్టీ నాశనమవుతున్నది. ఒక పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా రామన్నా నువు జాగ్రత్త. పార్టీని కాపాడుకో. ఇవాళ నాపై వేటు పడింది. రేపు నీకు కూడా ఎసరు పెడతరు. అప్రమత్తంగా ఉండు' అని కవిత సూచించారు. రాఖీ పండుగ రోజు తాను రాఖీ కడతా అని రామన్నకు మెసేజ్ పెట్టిన. రామన్న అందుబాటులో లేకపోవడం వల్ల కట్టలేకపోయిన. మా కుటుంబాన్ని విడదీయాలని హరీశ్ రావు, సంతోశ్ కంకణం కట్టుకున్నరు. ఐదున్నర నెలలు నేను తీహార్ జైలులో ఉన్న. నాకు 27 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు ఉద్యమాల్లోకి వచ్చిన. నా తండ్రి కేసీఆర్ చిటికెన వేలు పట్టుకుని ఉద్యమాలు నేర్చుకున్న. ఆయనపై నాకు కోపం ఉండదు. పార్టీ కోసం 20 ఏళ్లు పనిచేసిన. 103 రోజుల నుంచి క్షోభ అనుభవించిన. కానీ, రామన్న కనీసం.. కాల్ చేయలే. ఎలా ఉన్నవ్ అని మందలించలే. కుటుంబ పరంగా, కాకపోయినా పార్టీ పరంగానైనా అరుసుకోవాలె కదా' అని కవిత భావోద్వేగానికి గురయ్యారు.

### - చెవిలోని జోరీగ సంతోష్..

'మాజీ ఎంపీ సంతోశ్ చెప్పు కింద రాయి.. చెవిలోని జోరీగ. కూరలో ఉప్పు. ఆయన గురించి చెప్పడానికి అంత సీన్ ఏమీ లేదు. కానీ, కొన్ని విషయాలు ఉన్నయి. ఆయనకు ధనదాహం. ఎప్పుడూ కేసీఆర్ పక్కనే ఉంటడు. కుటుంబాన్ని ముంచాలని చూస్తడు. రామన్న ఎమ్మెల్యేగా ఉన్న సిరిసిల్ల నియోజకవర్గంలో ఒక ఇసుక లారీ దళితుడిని గుద్దింది. ఘటనలో దళితుడు చనిపోయిండు. ఆ కుటుంబం వాళ్లు పోలీసుల దగ్గరకు వెళ్లారు. సంతోశ్ పోలీసులకు కాల్ చేసి దళితులను కొట్టించిండు. పోలీసులు ఐదు కుటుంబాలను చావ బాదారు. ఇప్పటికీ ఆ నింద రామన్ననే మోస్తున్నడు. హరితహారం చేయాలని కేసీఆర్ అంటే.. సంతోశ్ ఫారెస్ట్ ల్యాండ్స్ కొట్టేయడానికి గ్రీన్ ఇండియా చాలెంజ్ అన్నడు. పోచంపల్లి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక సామాన్య మధ్యతరగతి కుటుంబంలో పుట్టిండు. ఆయన ఇప్పుడు మేఘా వాళ్లతో కలిసి హైదరాబాద్ శివారులోని మోకిల్లాలో రూ.750 కోట్ల విల్లాల ప్రాజెక్ట్ కడుతున్నడు. ఇప్పుడాయన్ను వాళ్ల ఊరోళ్లు శ్రీమంతుడు అంటున్నరు. ఆయనెవరంటే సంతోశ్ క్లాస్మేట్. అలాగే నవీన్ రావు మరో ఎమ్మెల్సీ ఉన్నడు. ఎమ్మెల్సీ ఇచ్చింది కేసీఆర్ కానీ, తనకు దేవుడు సంతోశ్ అంటడు. మొన్న వాళ్ల నాయిన పేకాట ఆడుతూ పట్టుబడ్డడు. సంతోశ్ ఆ కేసులన్ని మాఫీ చేయించిండు' అని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు.

# మహిళా కళాకారులకు బహుమతులు

## సత్కరించిన మొగుళ్లపల్లి ఎస్సై అశోక్

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మొట్లపల్లి గ్రామంలో ఆధ్యాత్మిక గీతాలతో భజన కార్యక్రమాలు నిర్వహించిన మహిళ కళాకారులను మొగుళ్లపల్లి ఎస్సై బోరగల అశోక్ బహుమతులతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గణపతి నిమజ్జనాలు శాంతియుత వాతావరణంలో జరగాలని, డీజే పాటల కంటే సంకీర్తనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఎస్సై అశోక్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాకారులు, గణపతి ఉత్సవ కమిటీ చైర్మన్ ఆళ్ళ మాధవరెడ్డి, సామల అన్నారెడ్డి, చిలుకూరి అమరేందర్ రెడ్డి, పూజారి కృష్ణమూర్తి, విగ్రహ దాత రాళ్లబండి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గజ్జి రాజకుమార్, ఆలయ చైర్మన్ గూడూరు రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్సైని సన్మానించిన ఉత్సవ కమిటీ సభ్యులు

# ఎస్జీఎఫ్ కార్యదర్శిగా డాక్టర్ సూరం రాము



అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా జడ్పిహెచ్ఎస్ (బాయ్స్) ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సూరం రాము ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంఈవో గద్దం భిక్షపతి వెల్లడించారు. కార్యక్రమంలో జడ్పిహెచ్ఎస్ బాయ్స్ ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ జి. పద్మ, టీఆర్‌టిఎఫ్ జిల్లా అధ్యక్షులు బాసిరి రాజి బాపురావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.







# పల్లా X పోచంపల్లి

- ఎమ్మెల్సీ పోచంపల్లిపై జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు
- 'మేఘా'తో కలిసి రూ.750 కోట్ల విల్లా ప్రాజెక్ట్ కడుతున్నాడని వెల్లడి
- ఈ విషయాన్ని స్వయంగా ఎమ్మెల్యే పల్లానే తనకు తెలిపాడని స్పష్టీకరణ
- గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో జనగామ సీటుపై ఇద్దరి గురి
- పల్లాకు సీటు దక్కడంతో పోచంపల్లి అసంతృప్తి
- కవిత వ్యాఖ్యలతో మరోసారి బయటపడిన విభేదాలు

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

బీఆర్ఎస్ లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి మధ్య వార్ నడుస్తున్నట్లు తాజా పరిణామాలతో బయటపడింది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తాజాగా చేసిన వ్యాఖ్యలతో వీరిద్దరి మధ్య విభేదాలు ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. కవిత బుధవారం హైదరాబాద్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీ సంతోశ్ కుమార్ గురించి చెప్తూ.. ఆయన పోచంపల్లి శ్రీనివాసరెడ్డికి రాజకీయ భవిష్యత్తు కట్టబెట్టారని చెప్పారు. అంతేకాదు.. శ్రీనివాసరెడ్డి హనుమకొండ జిల్లాలోని వరికోలు గ్రామానికి చెందిన అతి సామాన్యుడు అని, అలాంటి సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి ఇప్పుడు కోట్లకు పడగలెత్తాడని వ్యాఖ్యానించారు. అక్కడితో ఆగకుండా.. ఇప్పుడు పోచంపల్లి శ్రీనివాసరెడ్డి మేఘా వాళ్లతో కలిసి బ్లూఫిన్ కంపెనీ పేరుతో హైదరాబాద్ లోని మోకిల్లాలో రూ.750 కోట్ల విల్లా ప్రాజెక్ట్ కడుతున్నడని సంచలన వ్యాఖ్యలు చేశారు. సామాన్యుడన్న ఊరి వాళ్లే ఇప్పుడు పోచంపల్లిని శ్రీమంతుడు అంటున్నారని వెల్లడించారు. ఒక మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన శ్రీనివాసరెడ్డి అన్ని కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. ఆయన వెనుక సంతోశ్ ఉన్నారని, కేవలం సంతోశ్ క్లాస్మేట్ కావడంతోనే శ్రీనివాసరెడ్డి పైకి వచ్చాడని ఆరోపించారు. దీనిలో కొసమెరుపు ఏంటంటే.. ఈ విషయాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డే తనకు తెలిపారని కవిత వెల్లడించారు. కావాలంటే.. పల్లా రాజేశ్వర్‌రెడ్డిని సంప్రదిస్తే.. శ్రీనివాసరెడ్డి బాగోతాన్ని చెప్తాడనటం విశేషం.

**- అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆధిపత్యపోరు**

2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో జనగామ సీటు దక్కించుకునేందుకు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాసరెడ్డి గట్టి ప్రయత్నాలు చేశారు. జనగామ నుంచి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని పార్టీ పక్కన పెట్టే అవకాశం ఉందని, ఆయనకు తిరిగి పార్టీ టికెట్ ఇచ్చే సూచనలు కనపడటం లేదని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి జనగామ నియోజకవర్గం నుంచి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిత్వాన్ని ఆశించారు. ఇందులో భాగంగా ఈ నియోజకవర్గంలో శ్రీనివాసరెడ్డి కొంత వర్క్ చేశారు. పలు కార్యక్రమాలు నిర్వహించారు. బీఆర్ఎస్ జనగామ సీటు తనకే ఇస్తుందని శ్రీనివాసరెడ్డి భావించారు. కానీ, చివరకు తనకు రావాల్సిన సీటును పల్లా రాజేశ్వర్‌రెడ్డి దక్కించుకున్నారని శ్రీనివాసరెడ్డి కలత చెందారు. దీంతో శ్రీనివాసరెడ్డి అసంతృప్తికి గురయ్యారు. అప్పటి నుంచి వారిద్దరి మధ్య పార్టీలో ఆధిపత్య పోరు నడుస్తున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లాలో టాక్ ఉంది. ఎవరికి వారు బీఆర్ఎస్ లో తమ బలం పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. తాజాగా కవిత చేసిన వ్యాఖ్యలతో మరోసారి వారి మధ్య విభేదాలు చర్చకు దారి తీశాయి. కేసీఆర్ కు దగ్గరి మనిషిగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సంతోశ్ కు దగ్గరి మనిషిగా శ్రీనివాసరెడ్డి ఉంటూ, వీరిద్దరూ పార్టీలో కొనసాగుతున్నారా అనే చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్ రెడ్డి నియోజకవర్గంలో పార్టీ పరమైన అంశాలనూ చూసుకుంటుండగా, చాపకింద నీరులా శ్రీనివాసరెడ్డి తన పని తాను చేసుకుంటూ పోతున్నారని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు శ్రీనివాస్‌రెడ్డి జనగామ నియోజకవర్గం అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు ఇచ్చారు. నాటి ఎమ్మెల్యే ముత్తిరెడ్డిపై ఉన్న వ్యతిరేక తను అనుకూలంగా మల్చుకునే యత్నం చేశారు. చివరకు పల్లా రంగ ప్రవేశంతో నిరాశ చెందారు. పల్లా, పోచంపల్లి మధ్య విభేదాలు ముున్ముందు ఇంకా ఏ స్థాయికి వెళ్తాయో వేచి చూడాల్సిందే.





# జాతీయ రహదారిపై గండ్ర ధర్నా

## యూరియా కొరత తీరాలని డిమాండ్

అక్షర దర్బార్, శాయంపేట: మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నేతృత్వంలో శాయంపేట మండలం మందారిపేట జాతీయ రహదారిపై బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని, కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న సీబీఐ విచారణను రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు "కావాలయ్య యూరియా – రావాలయ్య కేసీఆర్" అంటూ నినాదాలు చేశారు. తరువాత గండ్ర మండలంలోని యూరియా సరఫరా కేంద్రాలను పరిశీలించారు. రైతు మహిళలతో మాట్లాడుతూ వారి సమస్యలు విన్న ఆయన, అగ్రికల్చర్ అధికారితో ఫోన్‌లో మాట్లాడి గ్రామాల వారీగా టోకెన్ విధానంలో యూరియా పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, మాజీ జడ్పీటీసీ వంగాల నారాయణ రెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ దుదిపాల తిరుపతి రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ దాసి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయుల నిర్మాణాలు అద్భుతం

- ప్రాకారపు ఆలయాలు శివ ద్వారపాలక విగ్రహాలు ఆకట్టుకున్నాయి
- శిల్ప సంపదను భావితరాలకు అందేలా చూడాలి
- సాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సుల్ ఐఎఫ్ఎస్ బృందం
- జిల్లా కలెక్టర్ తో కలిసి కోటగుళ్ల సందర్శన

అక్షరదర్బార్, గణపురం: కాకతీయుల నిర్మాణాలు ఎంతో అద్భుతమని భారత విదేశాంగ శాఖకు చెందిన సాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సుల్ జనరల్ శ్రీకర్ కే రెడ్డి, బ్రూనై భారత హై కమిషనర్ రాము అబ్బగాని, ఉన్నతాధికారులు అన్నారు. బుధవారం కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గణపతి, నందీశ్వర, గణపేశ్వర, పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం సీనియర్ జర్నలిస్ట్ తాళ్లపల్లి యాదగిరి గౌడ్ అధికారుల బృందానికి ఆలయ విశిష్టతను వివరించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శివ ద్వారా పాలక విగ్రహాలను చూసి ఫోటోలు వీడియోలు చిత్రీకరించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు నాగరాజు అధికారుల బృందాన్ని శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట గణపురం తహసిల్దార్ మధురకవి సత్యనారాయణ స్వామి, ఎంపీడీవో ఎల్ భాస్కర్, ఆర్ఐ చెక్క దేవేందర్ తదితరులు ఉన్నారు.





# పత్తి దిగుమతులపై పన్నులు పునరుద్ధరించాలి

అక్షర దర్బార్, నర్సంపేట : ప్రభుత్వ దివాలా విధానాల వల్ల పత్తి రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని ఆత్మహత్యలు చేసుకుంటున్నారని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) జిల్లా కన్వీనర్ కుసుంబ బాబురావు విమర్శించారు. బుధవారం నర్సంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్‌కేఎం ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ, కేంద్రం విదేశీ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ దేశీయ రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టిందని అన్నారు. విదేశీ పత్తి దిగుమతులపై 11% సుంకాన్ని ఎత్తివేయడం వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా పత్తి దిగుమతులపై సుంకాలు పునరుద్ధరించి, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధర నిర్ణయించాలని, రైతులకు సంపూర్ణ రుణమాఫీ చేయాలని, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.



# వేములపల్లిలో బురద రోడ్డుపై నాట్లు

**నాయకుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల వినూత్న నిరసన**

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: వేములపల్లి గ్రామంలో గ్రామస్తులు బురద రోడ్లపై వినూత్న నిరసన చేపట్టారు. వర్షాల కారణంగా బురదమయమైన రోడ్డుపై వరి నాట్లు వేస్తూ నాయకులు, అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు బురదలో కూరుకుపోవడంతో హనుమకొండ–బంగ్లాపల్లి మార్గంలో బస్సులు రాకపోకలు నిలిచిపోయాయని, ప్రయాణికులు ఆరోగ్య పరమైన సమస్యలకు గురవుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తారు రోడ్డు వేయాలని, లేకుంటే నిరసనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.




# నూతన ఏడీఏకి సన్మానం

అక్షర దర్బార్, పరకాల: పరకాల మండల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నూతన ఏడీఏ జగదీశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి, బొకే అందజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాడికారి శివాజీ, కోశాధికారి ఎర్రం లక్ష్మణ్, వ్యవసాయ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# గణపతి విగ్రహానికి వినతి పత్రం

**రైతులకు యూరియా అందించాలంటూ బీఆర్ఎస్ ధర్నా**

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలో రైతులకు యూరియా అందించాలని కోరుతూ BRS పార్టీ నాయకులు వినాయకుడికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం చౌరస్తాలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి నేతృత్వంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గండ్ర జ్యోతి మాట్లాడుతూ, "రాష్ట్రంలో రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కాళేశ్వరం నిర్మించి రైతులకు నీరందించిన కేసీఆర్‌పై సీబీఐ విచారణ పెట్టడం సిగ్గుచేటు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు మానుకొని రైతులకు తక్షణం యూరియా అందించాలి" అని డిమాండ్ చేశారు. తరువాత కార్యకర్తలు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల BRS నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.





# విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర
- గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లో విద్యార్థుల సమస్యలను తెలుసుకుని, కిచెన్‌షెడ్, స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. ఆర్వో ప్లాంట్ పనిచేయకపోవడం, గీజర్, డిజిటల్ క్లాస్‌రూమ్స్, క్రీడా సామాగ్రి, మెష్ డోర్లు, ఫ్యాన్ల సమస్యలు వంటి అంశాలను విద్యార్థులు వివరించగా, ఎమ్మెల్యే వెంటనే ఐటీడీఏ పీవోకు ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. వసతిగృహాన్ని పక్క భవనంలోకి మార్చాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, విద్యార్థులు చక్కగా చదివి సమాజానికి ఉపయోగపడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఆడపిల్లలకు అండగా 'కళ్యాణ లక్ష్మి'

**ఎమ్మెల్యే మాధవరెడ్డి**



అక్షర దర్బార్, నర్సంపేట : ఆడపిల్లలకు అండగా నిలిచే పథకంగా కళ్యాణలక్ష్మి పథకం కొనసాగుతోందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో నియోజకవర్గానికి చెందిన 245 మందికి రూ.2.45 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులను కోరిన ఆయనతో పాటు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హరిబాబు, పీఏసీఎస్ చైర్మన్ రమణా రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ లో జయశంకర్ జిల్లా ప్రతిభ

అక్షర దర్బార్, భూపాలపల్లి : చెన్నైలో ఆగస్టు 27 నుంచి 31 వరకు జరిగిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా విద్యార్థులు పతకాలు సాధించారు. పాయింట్ ఫైటింగ్ ఎంగెస్ట్ 28 కేటగిరీలో మాదాసి విధిష దేవి కాంస్య పతకం, కిక్ లైట్ ఫైటింగ్ ఎంగెస్ట్ 28 కేటగిరీలో తాడబోయిన హరిణి కాంస్య పతకం గెలుచుకున్నారని కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసి శ్రీనివాస్, కోచ్ గోసిక అశోక్ తెలిపారు. పతక విజేతలను రాష్ట్ర కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు, కార్యదర్శి మహిపాల్ అభినందించారు.



# విద్యుత్ సరఫరా నిలిపివేత

అక్షరదర్బార్, హసన్ పర్తి: హసన్ పర్తి ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 8గంటల నుండి 11గంటల వరకు విద్యుత్ సరఫరా హసన్ పర్తికి ఉండదని స్థానిక ఏఈ శిరీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగ దారులు సహరించాలని ఆయన కోరారు.

# చిట్యాల గణేష్ వర్తక సంఘం ఆధ్వర్యంలో అన్నదానం



అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలోని గణేష్ వర్తక సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కుంకుమార్చన, మహా అన్నప్రసాద కార్యక్రమం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పిండివంటలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో విగ్రహ దాత ఈగ రాజేందర్, కమిటీ అధ్యక్షుడు తాటిపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చింతకింది శ్రీనివాస్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వల్లాల ప్రవీణ్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మీసేవ సెంటర్లలో తనిఖీలు

- నిర్ణీత రుసుము కంటే అదనంగా వసూలు చేస్తే చర్యలు తప్పవు
- ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్



అక్షర దర్బార్, వెంకటాపురం (నూగూరు): వాజేడు, వెంకటాపురం మండలాల్లోని పలు గ్రామాల్లో మీసేవ సెంటర్లపై ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సామాజి దేవేందర్ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత రుసుము కంటే అదనంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మీసేవ సెంటర్లు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి, ఈఎస్డీ గైడ్‌లైన్స్ ప్రకారం సేవలు అందించాలని సూచించారు. మీసేవ, భూభారతి, లేబర్ ఇన్సూరెన్స్, జనన–మరణ ధృవీకరణ వంటి సేవలను తప్పులు లేకుండా అందించాలని ఆదేశించారు. అలాగే సెంటర్లలో సిటిజెన్ చార్టర్, మీసేవ లోగో, భూభారతి ఫ్లెక్సీలు, తహసీల్దార్, ఈడీఎం, పరిష్కారం కాల్‌సెంటర్ నంబర్లు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. మండలాలలో ఆధార్ సేవల కొరత దృష్ట్యా త్వరలో శాశ్వత ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీసేవ జిల్లా మేనేజర్ పోలోజు విజయ్, సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# పంటల కోసం రైతుల పాట్లు

**- యూరియా దొరకక అరిగోస**

అక్షరదర్బార్, టేకుమట్ల: పంటల సాగు పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. పంటలకు ప్రాణం పోసే యూరియా ఎరువు అందక రైతులు ఎరువుల దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. ఉదయం నుంచి క్యూ లైన్ లో నిల్చొని ఎదురుచూసినా చేతికి తగినంత యూరియా దొరకక నిరాశతో ఇంటికి చేరుతున్నారు. ఈ దశలో యూరియా పడకపోతే పంటలన్నీ వాడిపోతాయి. విత్తనాలు వేసి శ్రమించి పెట్టిన డబ్బంతా వృధా అవుతుందని రైతులు వాపోతున్నారు. ఒక వైపు అప్పులు, మరో వైపు ఎరువుల కొరత ఇలా రెండు వైపులా ఇరుక్కుపోయి రైతులు అరిగోస పడుతున్నారు.



# అప్పుల బారినుండి కాపాడిన ఆరోగ్యశ్రీ

అక్షర దర్బార్, చిట్యాల : ముచినిపర్తి గ్రామ శివారు వెంకటేశ్వర్లపల్లి చెందిన లక్కర్స్ పైడయ్య–రమా దంపతులు తమ కుటుంబాన్ని అప్పుల పాలవకుండా కాపాడిందని రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి కృతజ్ఞతలు తెలిపారు. వారి మనవడు రోహిత్ (8) ప్రమాదవశాత్తు చేయి విరగడంతో హనుమకొండలోని సుశ్రుత హాస్పిటల్‌లో ఆరోగ్య శ్రీ పథకం కింద ఉచితంగా శస్త్రచికిత్స జరిపి, ఉచిత వసతి, భోజనం, రవాణా సౌకర్యాలు కల్పించారు. రోహిత్ పేరు ఆరోగ్యశ్రీ డేటాబేస్‌లో లేకపోవడంతో స్థానిక ఆరోగ్యమిత్ర తిరుపతి, రాజమౌళి సహకారంతో తక్షణమే కార్డు అప్డేట్ చేసి చికిత్స అందించారు. ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ నిఖిల్ స్వరూప్, జిల్లా మేనేజర్ విక్రమ్, టీం లీడర్ యామంకి అనిల్ సహకారానికి కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.



# మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

**: సీఐ రంజిత్ రావు**

అక్షర దర్బార్, పరకాల : దామెర మండలం ఒగ్లాపూర్‌లోని ఎస్‌బిఐటి స్కూల్‌లో బుధవారం పోలీస్ కళా జాగృతి బృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, బాల కార్మికులు, గుట్కా, గంజాయి, డ్రగ్స్ వంటి అంశాలపై పాటలు, నాటికలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాయంపేట సీఐ రంజిత్ రావు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. అంధవి శ్వాసాలను దూరం పెట్టుకోవాలని, కొత్త తరహా "4జి" మోసాలకు జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో దామెర ఎస్సై కొంక అశోక్, పాఠశాల ప్రిన్సిపాల్ సమ్మయ్య, ఏఎస్ఐ నాగమణి, కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

అక్షర దర్బార్, నర్సంపేట : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు అన్నారు. బుధవారం గీతాంజలి డిజి స్కూల్ విద్యార్థినులు సమన్విత, సాత్వికలు అంతర్జాతీయ కరాటే పోటీల్లో పతకాలు సాధించిన సందర్భంగా జరిగిన అభి నందన సభలో ఆయన విద్యార్థినులకు పతకాలు అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినుల విజయాలు నర్సంపేటకు గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాణా ప్రతాప్ రెడ్డి పరామర్శ..

అక్షర దర్బార్, నల్లబెల్లి : నల్లబెల్లి మండలం మూడుచెక్కల పల్లి గ్రామానికి చెందిన బీజేపీ మండల కార్యదర్శి పున్నం కృష్ణమూర్తి తల్లి పున్నం నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతి పట్ల బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి సంతాపం తెలుపుతూ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తడుక వినయ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ బొద్దిరెడ్డి ప్రతాప్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నాగరాజు, ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# స్వామివారికి పూజలు

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండలోని యాదవ నగర్ కృష్ణ కాలనీలో కొలువైన గణపతి మండపంలో 108 రకాల నైవేద్యాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వరసిద్ధి వినాయక గజానన మండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పూనమ్ చందర్ స్వాతి, రమేష్ అనూష, మహేందర్ జ్యోతి, తేజ సంతోష్, శ్రీకాంత్ దివ్య, అశోక్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ విద్యార్థులకు

# తప్పిన పెను ప్రమాదం

- **స్టీరింగ్ ఫెయిలై అదుపు తప్పిన మాంటిస్సోరి స్కూల్ బస్సు**
- **పెద్ద ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న వైనం**
- **కాటారం మండలంలో చోటుచేసుకున్న ఘటన**
- **స్కూల్ బస్సుల ఫిట్నెస్ పై అధికారుల తూ తూ మంత్రపు తనిఖీలు**
- **ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు**



అక్షరదర్బార్, కాటారం: ప్రైవేటు పాఠశాలల యజమానులు బస్సుల ఫిట్‌నెస్ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీనీ విద్యార్థుల భద్రతను మాత్రం గాలికొదిలేస్తున్నారు. ఏటా పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సమయానికి వాహనాలను ఫిట్‌నెస్ చేయించుకోవాల్సిన వారు ఆ విషయాన్ని అసలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కండిషన్‌లో లేని పాత బస్సులను రోడ్లపై తిప్పుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ముఖ్యంగా కాటారం మండలంలో ప్రయివేట్ పాఠశాలల బస్సులు ఇష్టారాజ్యంగా నడుస్తుండగా పట్టించుకోవాల్సిన సంబంధిత అధికారులు మాత్రం నెలవారీ మామూళ్ల మత్తులో ఊగుతూ పచ్చ జెండా ఊపుతున్నట్లుగా విమర్శలు వెలువెత్తుతున్నాయి.

**- స్టీరింగ్ ఫెయిలై..**

కాటారం మండలకేంద్రానికి చెందిన మాంటిస్సోరి ప్రైవేట్ పాఠశాల బస్సు రోజూలానే బుధవారం విద్యార్థులను తీసుకురా వడానికి దంతాలపల్లి గ్రామం వైపునకు వెళ్ళింది. అయితే విద్యార్థులను బస్సులో ఎక్కిం చుకుని వస్తుండగా స్టీరింగ్ ఫెయిలవ్వడంతో ఒక్కసారిగా బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు వెళ్ళింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న విద్యా ర్థులకు త్రుటిలో ప్రాణాపాయం తప్పగా ఊపిరి పీల్చుకున్నట్లయ్యింది. ఆ స్కూల్ బస్సులో సుమారు 30 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్న ట్లుగా సమాచారం. కాగా త్రుటిలో తప్పిన ప్రమాదం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిట్నెస్ లేకపోవ డంతోనే బస్సు స్టీరింగ్ ఫెయిలయ్యిందని సదరు ప్రైవేట్ పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**- పాఠశాల యాజమాన్యం లాబీయింగ్**

బుధవారం స్కూల్ బస్సు అదుపు తప్పిన సంబ ధించిన ఘటనలో ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం రంగంలోకి దిగినట్లుగా విశ్వస నీయ సమాచారం. కాంట్రాక్టర్ కం స్కూల్ పాట్నర్ అయినా సదరు వ్యక్తి మీడియాను బజ్జ గించినట్లుగా తెలిసింది. మీడియాలో విషయం పెద్దగా రావొద్దని అన్ని రకాల సహకారం అంది స్తానని సదరు వ్యక్తి హామీ ఇచ్చినట్లుగా వినిపి స్తోంది. ఏది ఏమైనా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న విద్యాసంస్థలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవా ల్సింది ఉండగా మిన్నకుండి పోతున్న తీరు ప్రశ్నార్థకమవుతుంది.

# డ్రోన్ సాయంతో యూరియా పిచికారి



అక్షరదర్బార్, టేకుమట్ల: మండలంలోని కుంద నపల్లి గ్రామంలో సుంకర పూర్ణచంద్రరావు, ఇతర రైతులు వ్యవసాయ క్షేత్రంలో సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో డ్రోన్ సాయంతో యూరియా పిచికారి నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో అనేక మంది రైతులు పాల్గొని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎం కళ్యాణి మాట్లాడుతూ డ్రోన్ సాంకేతికత ద్వారా యూరియా, సూక్ష్మపోషకాలు, క్రిమిసంహార మందులు తక్కువ మోతాదులోనే పంటలకు సమర్థవంతంగా చేరుతాయని తెలిపారు.

## ప్రియుడితో కలిసి

# భర్త, కూతురు హత్య

- **చిట్యాల మండలంలోని ఒడితెల గ్రామంలో ఘటన**
- **నిందితులను ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు**
- **వివరాలు వెల్లడించిన భూపాలపల్లి జిల్లా ఎస్పీ**

అక్షరదర్బార్, భూపాలపల్లి క్రైమ్ : వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నారని ఓ మహిళ ప్రియుడితో కలిసి తన భర్త, కూతురిని హత్య చేసింది. భూపాలపల్లి జిల్లాలో వెలుగులోకి వచ్చిన ఈ ఘటన సంచలనం కలిగించింది. జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే బుధవారం మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం చిట్యాల మండలం ఒడితెల గ్రామానికి చెందిన కప్పల కుమారస్వామి తన మొదటి భార్య చనిపోవడంతో 24 ఏళ్ల క్రితం మల్హర్ మండలం లోని తాడిచర్ల గ్రామానికి చెందిన మాదవేణి కవితను రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కూతుళ్లు జన్మించారు. పెద్ద కూతురు కప్పల వర్షిని (22). చిన్న కూతురు కప్పల హన్సిక (21). కప్పల హన్సిక వివాహమై ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుమారస్వా మికి ఐదేళ్ల క్రితం పక్షవాతం రావడంతో ఆయన ఇంటికే పరిమితం అయ్యాడు. ఈ క్రమంలో ఒడితల గ్రామంలోని యువకుడు జంజర్ల రాజకుమార్ తో కప్పల కవితకు పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. మూడేళ్ల నుంచి రాజకుమార్, కవిత తరచు కలుసుకుంటున్నారు. కుమారస్వామికి తెలియడంతో కుటుం బంలో తగాదాలు జరుగుతున్నాయి. తమకు అడ్డువస్తున్నాడని కుమా రస్వామిని తొలగించుకునేందుకు తన పెద్ద కూతురు ఇంట్లో లేని సమయంలో గత జూన్ 25న మధ్యాహ్నం పక్షవాతంతో మంచం పై పడుకొని ఉన్న భర్త కుమారస్వామిని కవిత, రాజ్ కుమార్ తో కలిసి గొంతు నులిమి హత్య చేశారు. అనారోగ్యంతో చనిపోయినట్టు బంధు వులను నమ్మించి కవిత తన భర్త అంత్యక్రియలు జరిపించింది.

**- కూతురు వర్షిని హత్య**

తర్వాత ఈ విషయమై పెద్ద కూతురు వర్షిని తల్లిని నిలదీయడం, కవితను కలవడానికి ఇంటికి వస్తున్న రాజ్ కుమార్ ను అడ్డుకోవడం వంటివి చేయడంతో వర్షిని అడ్డు కూడా తొలగించుకోవాలని కవిత, రాజ్ కుమార్ నిర్ణయించారు. వీరిద్దరు కలిసి ఈనెల 2న అర్ధరాత్రి వర్షిని నిద్రలో ఉన్న సమయంలో కుమారస్వామిని చంపిన మాదిరి గానే వర్షినిని హత్య చేసి మృతదేహాన్ని సంచిలో మూటకట్టి గ్రామ శివారులో చెట్లపొదల్లో పడేశారు. ఈనెల 6న కవిత తనకు కూతురు వర్షిని కనిపించడం లేదని చిట్యాల పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే రాజ్ కుమార్, కవిత ఒడితల గ్రామ శివారులో తాము పడేసి న వర్షిని మృతదేహాన్ని ఈ నెల 25న సంచిలో మోటార్ సైకిల్ ద్వారా తీసుకెళ్లి కమలాపురం క్రాస్ రోడ్డు దాటాక కాటారం వైపున నేషనల్ హైవే పక్కన పడేశారు. క్షుద్ర పూజలు చేసి చంపారని ప్రజలను నమ్మించేందుకు మృతదేహం వద్ద నిమ్మకాయలు పెట్టి పసుపు కుంకుమ చల్లారు. ఈనెల 28న గుర్తుతెలియని యువతి మృతదే హంగా సమాచారం అందుకున్న కాటారం పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో వర్షిని హత్య కేసును చేదించారు. బుధవారం కొయ్యూరు నుంచి గంగారం క్రాస్ మీదుగా మహారాష్ట్ర వెళ్తున్న కప్పల కవిత, ఆమె ప్రియుడు రాజ్ కుమార్ ను కాటారం పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు కుమారస్వామి, వర్షినిని హత్య చేసినట్టు అంగీక రించారు. కేసును చాకచక్యంగా చేదించిన కాటారం డీఎస్పీ సూర్యనా రాయణ, సీఐ నాగార్జున రావు, ఎస్సై శ్రీనివాస్ ను జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అభినందించారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్
విప్లవంలో
భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం
QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా
వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915